కథ

# తిరగబడిన కథ

## బద్దిగం పాండురంగారెడ్డి

రంగరాజు పులివంటి వ్యక్తి. పిల్లివంటి వ్యక్తికాదు. గంగిగోవు వంటివాడు. అతడు ఇంటా బయటా కూడా గంగిగోవే. పులివంటి భార్య దగ్గర పిల్లివలె ప్రవర్తించి సబార్డినేట్స్‌మీద పులి తీరున గాండ్రిస్తూ, పెత్తనం చలాయించడానికి అతడేం ఆఫీసరు కాదు. ఒట్టి టైపిస్ట్ క్లర్క్.

రంగరాజు బాధ్యతారహితంగా ప్రవర్తించడు. పక్కవాళ్ళ బాధ్యత కూడా నెత్తిన వేసుకుని మరీ పనిచేస్తాడు. అందుకతడు అభినందనలు, ప్రశంసలు అందుకొంటాడనుకుంటే, అది అపోహ అవుతుంది. కొలీగ్స్‌కి ఒక పనిలో సహాయం చేసినప్పుడు అందులో ఏమైనా తప్పులు దొర్లితే అందుకు తిట్లు- ఆఫీసరుద్వారా కొలీగ్సుకి, వాళ్ళనుండి రంగరాజుకి సరఫరా అవుతాయి. ఆ సరఫరాని పెళ్లాం పైకి మళ్లించడానికి రంగరాజుకింకా పెళ్లికాలేదు.

రంగరాజువల్ల కొలీగ్స్ డ్యూటీలలో పొరపాట్లు సంభవించినప్పుడు "ఏదో చెప్పక చెప్పక నీకీ పని చెప్తే, తప్పులుచేసి ఆఫీసరుచేత తిట్టిస్తావా?" అని అతడిమీద విరుచుకుపడేవారు అతని కొలీగ్స్. మళ్లీ వాళ్ళే "కొంచెం ఈ పని చేసిపెట్టు గురూ!" అని ముచ్చటపడిపోతే, అప్పుడు రంగరాజుపై గొడవలు మర్చిపోయి "వాళ్ళు తననే సహాయం కోరారుగదా!" అని మహదానందపడిపోతూ, ఆ పనులుచేసి పెడతాడు. ఆఫీసరు అగ్గిరాముడి అంశ కాబట్టి ఎప్పటికప్పుడు పనితోపాటు చీవాట్లలోనూ పాలుపంచుకునేవాడు రంగరాజు.

అటువంటి రంగరాజు వాళ్ళ ఆఫీసులో కొత్తగా అపాయింట్ అయిన లేడీక్లర్క్ లలినీని ప్రేమించాడు. ప్రేమించడమంటే ఇలా అలా కాదు. చాలా గాఢంగా ప్రేమించాడు. పెళ్లాడాలనుకున్నాడు. జీవితాంతం ఆమెతో ప్రేమ జగత్తులో పరవశించాలని కలలుగన్నాడు.

అంచేత ఒకరోజు-లంచ్ అవర్‌లో లలినీని కాంటీన్‌కి ఆహ్వానించాడు. టీ త్రాగుతుండగా మెల్లగా విషయం చెప్పాడు.

"నేను మిమ్మల్ని ప్రేమిస్తున్నానండీ!" ఈమాట చెప్పడానికి అతనెంతో ప్రయాసపడ్డాడు.

టీ త్రాగడం పూర్తయ్యేంతవరకూ ఆమెనుండి ఆశించిన జవాబు రాలేదు రంగరాజుకి.

అదయ్యాక "ఇక లేద్దామా?" అన్నది లలిని.

"అలాగేగానీ...మీరు జవాబు చెప్పలేదు"

"మీరడిగింది ప్రశ్నకాదుగా. ఆ ప్రేమను మీదగ్గరే పదిలంగా వుంచుకోండి" కొంటెగా నవ్వింది లలిని.

"అంటే నన్ను పెళ్లాడ్డం మీకిష్టంలేదా?"

"ఏం చూచి పెళ్లాడమంటారు?'

ఆ మాట కలిగించిన దిగ్భ్రాంతి నుండీ రంగరాజు కోలుకోకముందే "నే వెళ్తున్నా!" అంటూ నిష్క్రమించింది లలిని.



కాంటీన్ నుండి వచ్చేసి తన సీటులో కూర్చున్న రంగరాజుకి మనసు కకావికలమైపోయింది. ఆగ్రహంతో గుండె మండిపోతున్నది.

నిజమే! కన్నెపిల్ల తన కాబోయే భర్తలో కోరుకునే లక్షణాలు తనలో ఏమున్నాయి?

గంట తర్వాత-

"ఆఫీసరుగారు రమ్మంటున్నారండీ!" అంటూ అటెండర్ చెప్పగా రంగరాజు లేచి ఆఫీసర్ రూంకేసి నడిచాడు.

కొలీగ్స్ తలెత్తి అతడికేసి కసాయివాడి పాలబడిన గొర్రెను చూసినట్లు జాలిగా చూడసాగారు. రంగరాజు వధ్యశాలలోకి వెడుతున్న గొర్రెవలె బెదురుగా వెళ్లలేదు. ఎప్పటిలాగా సొంత ఇంట్లోకి నడిచినట్లు నడిచాడు.

అతడి పాదాల ధ్వని విన్న ఆఫీసర్ తల ఎత్తాడు. కూర్చోమని కనీస మర్యాదైనా పాటించకుండా తిట్ల దండకం మొదలుపెట్టాడు టైపింగ్‌లో ఏవో తప్పులు దొర్లాయంటూ.

మామూలుగా అయితే దున్నపోతుమీద వడగండ్ల వాన అన్న తీరులో రంగరాజుని ఆ తిట్లు పెద్దగా బాధించేవికావు. ఆఫీసరుగారు కదా అని దులిపేసుకుని (తిట్టడానికే ఆఫీసరన్నట్లు) "మరోసారి ఈ తప్పు జరగకుండా చూస్తాన్సార్" అని వినయంగా సంజాయిషీ ఇచ్చుకునేవాడు.

ఇప్పుడు మాత్రం రంగరాజుకి ఆ తిట్లు అర్థం లేనివిగా, అనవసరమైనవిగా తోచాయి. ఆగ్రహంతో మండిపోతున్న గుండెపై ఆజ్యం పోసినట్లయింది.

"షటప్! యూ బ్లడీఫూల్" అన్నాడు అరచినట్లుగా.

అతడి మాటకి ఆఫీసర్‌తోపాటు అక్కడే నిలుచుని వున్న అటెండర్ కూడా ఆశ్చర్యపోయాడు. ఆఫీసరు కుక్కిన పేనులా అయ్యాడు.

"తప్పేమన్నా వుంటే ఆ తప్పు చూపించి చెప్పు. మళ్లీ దొర్లకుండా చూచుకుంటాను. అంతేగానీ నీ ఇష్టమొచ్చినట్టు తిట్టడానికి నేనేమైనా నీ నౌఖర్నా? ఈ సంస్థలో నువ్వు పెద్ద నౌఖరువైతే నేను కాస్త చిన్నవాడ్ని. అంతే! నువ్వున్నది అజమాయిషీ చేయడానికే తప్ప అనవసరంగా తిట్టడానికి కాదు. ఇది గుర్తుంచుకుంటే మంచిది" అంటూ రంగరాజు ఆ రూమ్‌లోంచి వేగంగా వెళ్లిపోయాడు.

తన సీటులో కూర్చున్నాక రంగరాజుకి ఒళ్లంతా చెమట్లు పట్టడం మొదలైంది. ఆఫీసర్ని అంతగా తీసేసి మాట్లాడింది తనేనా? తనకి అంత ధైర్యం ఎలా వచ్చిందసలు? ఆఫీసరు ముందు తనకు గొంతు పెగిలేది కాదే. ఇదివరకు సంజాయిషీ కూడా చాలా నెమ్మదిగా ఇచ్చుకునేవాడు. మరిప్పుడు ఇలా?

అటెండర్ ద్వారా అంతా తెల్సుకున్న మిగతావాళ్ళు ఆశ్చర్యపోయారు. రంగరాజుకి ఉద్వాసన ఖాయమని ఏకగ్రీవంగా తీర్మానించేశారు.

అందరూ అనుకున్నట్లుగా రంగరాజుని ఆ ఉద్యోగంలోంచి తీసేయడంగానీ, మరొకచోటుకి ట్రాన్స్‌ఫర్ చేయడంగానీ చేయలేదు ఆఫీసరు. పైగా రంగరాజుని మన్నిస్తూ మాట్లాడడం మొదలుపెట్టాడు.

దానిక్కారణం రంగరాజు ఏదో పెద్ద 'అండ' ఉండడంవల్లనే తనసంతగా ఎదిరించి మాట్లాడి ఉంటాడన్న భయం ఆఫీసరుకి కలగడమే!

నెలరోజుల తరువాత తన సీటువద్దకు వచ్చి "మీతో పెళ్లి నాకిష్టమే!" అని నెమ్మదిగా చెప్పి సిగ్గుపడుతూ అక్కడ్నుంచి వెళ్లిపోతున్న లలినీకేసి ఆశ్చర్యంగా ఏదో వినరాని విషయం విన్నట్లు చూచాడు, పదిహేనురోజుల క్రితం నిశ్చయమైన తన పెళ్లికి వారంరోజులు సెలవు కావాలని లీవ్‌లెటర్ వ్రాస్తున్న రంగరాజు.

★